ప్రజాశక్తి
గురువారం 27 ఏప్రిల్ 2023

విద్యాదీవెన బహిరంగ సభలో జగనన్న స్టిక్కర్లతో విద్యార్థినులు

విద్యావిధానంలో సమూల మార్పులు

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిజిటల్ క్లాసులు
- ప్రభుత్వ పాఠశాలతో ప్రయివేటు పోటీ పడే పరిస్థితి
- 'వసతి దీవెన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి

విద్యాదీవెన బహిరంగ సభకు హాజరైన విద్యార్థులు, (ఇన్‌సెట్‌లో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి)

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, నార్పల

'రాష్ట్రంలో ఈ నాలుగేళ్లలో విద్యా విధానంలో సమూలమైన మార్పులు తీసుకొచ్చాం. ప్రయివేటుకు ధీటుగా కాదు.. ప్రభుత్వం పాఠశాలలతో ప్రయివేటు బడులు పోటీపడే పరిస్థితి రాబోతోంది.' అని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాడు నార్పల మండల కేంద్రంలో రాష్ట్ర స్థాయి వసతి దీవెన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని రాష్ట్ర వ్యాప్తంగా వసతి దీవెన కార్యాక్రమం కింద 9.55 లక్షల మందికి రూ.912.71 కోట్లను బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి విద్యార్థులు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూలేని విధంగా విద్యా విధానంలో సమూలమైన మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. ప్రయివేటుకు ధీటుగా కాదు... ప్రయివేటు విద్యా సంస్థలే ప్రభుత్వ పాఠశాలలతో పోటీపడే పరిస్థితులను తీసుకొస్తున్నట్టు వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మొదటి విడత నాడు-నేడు పనులు పూర్తయిన 30,232 పాఠశాలల్లో ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానల్స్ ద్వారా డిజిటల్ విద్యా బోధన తీసుకురానున్నామని వివరించారు. దీన్ని చూసి ప్రయివేటు విద్యా సంస్థలు సైతం ఈ పద్ధతిని పాటించాల్సి వస్తుందన్నారు. ఉన్నత విద్యా విధానంలోనూ అనేక మార్పులు తీసుకొచ్చామన్నారు. అంతర్జాతీయ పోటీని తట్టుకుని నిలబడే విధంగా ఉన్నత విద్యా విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు. ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలల్లో 37 లక్షల నుంచి 40 లక్షలకు పెరిగిందన్నారు. ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థుల సంఖ్య 87 వేల నుంచి 1.20 లక్షలకు పెరిగిందని చెప్పారు. ఉన్నత విద్యలో తీసుకొస్తున్న మార్పులతో అంతర్జాతీయంగా ఈ రాష్ట్రంలో చదువుకున్న పిల్లలు రాణించాలని ఆకాంక్షించారు. ఇప్పుడు చెప్పుకోవడానికి ఒక్క సత్యానాదేళ్లనే ఉన్నారని, అటువంటి వారు వందమంది కావాల్సిన అవసరముందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా టాప్ 50 విశ్వవిద్యాలయంలో సీటు వచ్చిన విద్యార్థులకు రూ.1.50 కోట్లు ఖర్చు చేసి విదేశీ విద్యా కానుక ద్వారా ప్రభుత్వమే చదివిస్తుందని చెప్పారు. ఉపాధిని కల్పించే విధంగా ఉన్నత విద్యాలోనూ మార్పులు తీసుకొచ్చినట్టు వివరించారు. ఇంటర్నుషిప్ విధానం తీసుకొచ్చామన్నారు. విద్య ద్వారానే సమాజ మార్పు జరుగుతుందన్న ఆశాభావం తమ ప్రభుత్వానికి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతోనూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషచరణ్ శ్రీ, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, పోతుల సునీత, జిల్లా కలెక్టర్ గౌతమి ఇతర జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి నేతల ఘనస్వాగతం.. వీడ్కోలు

నార్పలకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. బుధవారం ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి విమానంలో బయలుదేరిన ముఖ్యమంత్రి 10-30 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ ఆరుణ్‌కుమార్‌తో పాటు ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి హెలీక్యాప్టర్‌లో ముఖ్యమంత్రి నార్పల హెలిప్యాడ్ కు చేరుకున్నారు. నార్పలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కెవి.ఉషశ్రీ చరణ్, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు జొన్నలగడ్డ పద్మావతి, వై.వెంకట్రామిరెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర విద్యా సలహాదారు ఆలూరి సాంబశివా రెడ్డి, కలెక్టర్ ఎమ్.గౌతమి, అనంతపురం డిఐజి ఆర్ఎన్.అమ్మిరెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాస రావుతో పాటు వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు స్వాగతం పలికారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో హెలీక్యాప్టర్ మొరాయించడంతో ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన పుట్టపర్తికి వెళ్లారు. సాయంత్రం అక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

ముఖ్యమంత్రికి నిరసన సెగ

కాన్వాయ్‌ను అడ్డుకున్న మోటుమర్ల, తుంపర్తి రైతులు

సిఎం కాన్వాయ్‌ను అడ్డుకుంటున్న నిర్వాసిత రైతులు

ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి నిర్వాసిత రైతుల నుంచి నిరసన సెగ తగిలింది. నార్పలలో వసతిదీవెన కార్యక్రమం ముగిసిన అనంతరం హెలీప్యాడ్ మొరాయించడంతో ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన పుట్టపర్తికి బయల్దేరారు. ఈ సమయంలో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం, ధర్మవరం మండల పరిధిలోని తుంపర్తి, మోటుమర్ల గ్రామ భూ నిర్వాసిత రైతులు తమకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేస్తూ సిఎం కాన్వాయ్‌ను పోతులనాగేపల్లి లేఅవుట్ వద్ద అడ్డుకునే ప్రయత్నం చేశారు. భూములు పోయినా ఐదు సంవత్సరాలుగా పరిహారం రాకుండా ఉన్న విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే హఠాత్తుగా రోడ్డుపైకి అడ్డంగా వచ్చి కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు. వెంటనే వాహనాల్లో దిగి కాన్వాయ్‌కు అడ్డంగా వచ్చిన రైతులను పోలీసులు పక్కకు తోసేసి కాన్వాయ్‌ను ముందుకు తీసుకెళ్లారు. అయితే మహిళా రైతులు రోడ్డుపై పోర్లాడుతూ తమ బాధలు ఎవరు వింటారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లుగా పరిహారం కోసం అందరి చుట్టూ తిరిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతికెళ్లి ముఖ్యమంత్రికి విన్నవించుకుందామన్నా అవకాశం కల్పించలేదని చెప్పారు. కనీసం ఇప్పుడు రోడ్డు మార్గంలో తమ ఊరి వద్ద నుంచి ముఖ్యమంత్రి వెలుతున్నారని తెలిసి వినతిపత్రం ఇవ్వడానికి వెళితే ఇక్కడా పోలీసులు అడ్డుకున్నారని విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఆగి తమ బాధను వినింటే బాగుండేదని చెప్పారు.

శింగనమల నియోజకవర్గానికి పలు హామీలు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా శింగనమల నియోజకవర్గానికి పలు హామీలను ఇచ్చారు.

1.చాగల్లు ప్రాజెక్టు కింద ముంపుగ్రామాలుగా ఉన్న ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి గ్రామాలకు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకజీ కింద రూ.150 కోట్ల పరిహారం మంజూరు చేస్తాం.
2.గండికోట నుంచి సుబ్బరాయసాగర్‌కు పైప్‌లైన్ ద్వారా ఎత్తిపోతల పథకం ప్రారంభిస్తాం.
3.యల్లనూరు, పుట్లూరు మండలాల్లోని చెరువులకు నీరిస్తాం.
4.శింగనమల మండల కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణ పనులకు నిధుల కేటాయింపు చేస్తాం.
5.నార్పల మండల కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాల నిర్మాణానికి భూ సేకరణకు రూ.కోటి నిధులు కేటాయిస్తాం.
6.శింగనమల మండలం ఈస్టు నర్సాపురంలో బాలికల వసతి గృహాన్ని మంజూరు చేస్తాం.
7.మిడ్‌పెన్నార్ మరమ్మతులకు రూ.3 కోట్లు కేటాయిస్తాం.
8.యల్లనూరు, పుట్లూరు మండలాల్లో చిత్రావతిపై బ్రిడ్జి, కాజ్‌వే నిర్మాణానికి నిధులు కేటాయిస్తాం.

హెలీక్యాప్టర్‌లో సాంకేతిక సమస్య... రోడ్డు మార్గంలోనే తిరుగు ప్రయాణం

విద్యా వసతి దీవెన కార్యక్రమం ముగిసిన తరువాత ముఖ్యమంత్రి హెలిప్యాడ్ వద్ద జిల్లా నాయకులతో ముచ్చటించారు. జిల్లాలోని సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన తిరుగు ప్రయాణం అవడానికి హెలీక్యాప్టర్ ఎక్కాక అది మోరాయించింది. సాంకేతిక సమస్య తలెత్తడంతో ఆయన రోడ్డు మార్గంలోనే పుట్టపర్తికి చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరంకు వెళ్లారు.

స్పృహ తప్పిన ఇద్దరు

స్పృహ తప్పి కిందపడిపోయిన విద్యార్థినిని వైద్యశాలకు తీసుకెళ్తున్న సిబ్బంది

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నార్పల బహిరంగ సభలో ఇద్దరు స్పృహ తప్పి కిందపడిపోయారు. ఎస్ఎల్‌న్ విద్యా సంస్థలో చదువుతున్న పూజితారెడ్డి అనే విద్యార్థిని స్పృహ తప్పిపడిపోయింది. తోటి విద్యార్థులు వెంటనే ఆమెను వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలోకి తీసుకెళ్లి వైద్యులు చికిత్స అందించారు. ఎన్నికల విధులకు వచ్చిన మరో మహిళ కూడా ఇదే రకంగా పడిపోవడం జరిగింది. ఆమెకు చికిత్సను అందించారు. వేసవి కాలమైనప్పటికీ బుధవారం ఆకాశం మేఘావృతమై ఉండి కొంతసేపే వాతావరణ చల్లగా ఉన్నప్పటికీ తరువాత వేడెక్కింది. ఈ ఎండ వేడిమికి ఇద్దరూ అస్వస్థతకు గురయ్యారు.

ఇంటర్ ఫలితాల్లో అనంత'పూర్'

సీనియర్ ఇంటర్‌లో 67శాతం

జూనియర్‌లో 57 శాతం ఉతీర్ణత

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా ఉతీర్ణత గత ఏడాది కంటే తగ్గింది. బుధవారం సాయంత్రం ఇంటర్మీడియట్ ఫలితాలు గురించి ఆర్ఐఒ సురేష్ బాబు విలేకరులకు తెలియజేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 25,249 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుజ అయ్యారు. అందులో 14,504 మంది విద్యార్థులు ఉతీర్ణత సాధించారు. ఉమ్మడి జిల్లా ఉతీర్ణత శాతం 57గా ఉంది. 10,745 మంది ఫైల్ అయ్యారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 25,126 పరీక్షలు రాయగా అందులో 16,943 ఉతీర్ణత సాధించారు. ఉతీర్ణత శాతం 67గా ఉంది. 8,183 ఇందులో ఫెయిల్ అయ్యారు. ఇక ఓకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరం 2828 మందికి గాను 1039 మంది, ద్వితీయ సంవత్సరంలో 2711 మందికి గాను 1231 మంది ఉతీర్ణత సాధించారు.

పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయండి

నియోజకవర్గ టిడిపి కో ఆర్డినేటర్ గుండుమల

ప్రజాశక్తి-మడకశిర

అధిష్ఠానం ఆదేశాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ గుండుమల తిప్పేస్వామి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. పట్టణంలో బుధవారం పార్టీ శ్రేణులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న హౌస్ మ్యాపింగ్, ఇదేం ఖర్మ రాష్ట్రానికి, ఓటరు పరిశీలన, సభ్యత్వ నమోదు, టెలిగ్రామ్ ఇన్‌స్టాల్, తదితర అంశాల్లో చురుగ్గా పాల్గొని రాష్ట్రంలోనే మడకశిరను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. అలాగే అన్ని కార్యక్రమలను వేగవంతం చేయాలని మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలకు, పంచాయతీ, వార్డు అధ్యక్షులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు పులివెందుల పార్థసారధి రెడ్డి , రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, ఆర్‌టిఎస్ ట్రైనర్ కదిరి మనోహర్ నాయుడు, పార్లమెంట్ ఐటిడిపి ఇన్‌ఛార్జి రామాంజనేయులు, అగలి జడ్పీటీసీ ఉమేష్, కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, కుమారస్వామి, గణేష్, తదితరులు పాల్గొన్నారు .

చేనేత, రైతుసంఘం నాయకుల ముందస్తు అరెస్టు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం పోలీసు స్టేషన్‌లో ఉన్న చేనేత, రైతుసంఘాల నాయకులు

ముఖ్యమంత్రి వైస్.జగన్మోహన్‌రెడ్డి నార్పల పర్యటనకు వస్తున్న సందర్భంగా ఏపీ చేనేత కార్మిక సంఘం, రైతుసంఘం నాయకులను బుధవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజినేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకాచలపతి, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్నలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పిన తమను ముందస్తు అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు. చేనేత కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎన్నికల ముందు సాధ్యం కానీ హామీలు గుప్పించి వాటిని నేటికీ నెరవేర్చలేదన్నారు. వీటిని ప్రశ్నించడానికి వెళ్తున్న తమను అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. చేనేతల సమస్యలను పరిష్కరించేంత వరకు దశల వారీగా ఉద్యమాలు చేపడుతామన్నారు.

నాయకుల ముందస్తు అరెస్టు.. విడుదల

రాయదుర్గం : సీఎం జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా స్థానిక పోలీసులు ఎస్ఎఫ్ఐ, సిపిఎం, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, చేనేత కార్మిక సంఘం నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, సిపిఎం నాయకులు మల్లికార్జున, రమేష్, చేనేత కార్మిక సంఘం నాయకులు మధు, తిమ్మరాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు అంజి, ఏఐవైఎఫ్ నాయకులు కుమార్ నాయక్, అనిల్, ఎస్ఎఫ్ఐ నాయకులు గౌతమ్, వంశీలను పోలీసులు అదుపులో తీసుకొని మధ్యాహ్నం 2 గంటల అనంతరం వదిలిపెట్టారు. సీఎం జగన్ జిల్లా పర్యటనను అడ్డుకుంటారనే ఉద్దేశ్యంతో పోలీసులు వీరిని అదుపులో తీసుకొని అనంతరం వదిలివేశారు.

ప్రజా సంఘాల అడ్డగింత అప్రజాస్వామికం

కళ్యాణదుర్గం : తమ హక్కులను ప్రశ్నించేందుకు యత్నించిన ప్రజా సంఘాల నాయకులను అడ్డుకోవడం అప్రజాస్వామికమని దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి బుధవారం నార్పలకు వస్తున్న సందర్భంగా తమ డిమాండ్లను పరిష్కరించకుంటే పర్యటనను అడ్డుకుంటామని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. కాగా వారిని సీఎం పర్యటనకు వెళ్లనివ్వకుండా ముందుగానే అదుపులోకి తీసుకోవడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకొన్న వారిలో ప్రజాసంఘాల నాయకులు తిప్పేస్వామి నాయక్, అచ్యుత్ ప్రసాద్, ధనుంజయ నాయక్, ఆర్‌కే.రాజు, అశ్వర్థ, విరుపాక్షి, తదితరులు ఉన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీసత్యసాయి' విద్యార్థుల ప్రభంజనం

బి.చైతన్య సాగర్



బి.హారిక

కుముద

ఎస్.సానియా

ఎస్.భువనేశ్వరి

ప్రజాశక్తి -పెనుకొండ

ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని శ్రీసత్యసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారు. ద్వితీయ ఇంటర్ ఎంపీసీ విభాగంలో బి.చైతన్య సాగర్ 1000 మార్కులకు గానూ 978 మార్కులు సాధించాడు. అలాగే బి.హారిక (బైపిసి) 940/1000, కుమదా (సీఈసీ) 921/1000, సానియా (సీఈసీ) 919/1000, ప్రథమ ఇంటర్‌లో ఎస్.భువనేశ్వరి (ఎంపీసీ) 431/470 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కేశవయ్య, అధ్యాపకులు మల్లికార్జున, జంషీర్ బాషా విద్యార్థులను అభినందించారు.

జెసి.దివాకర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

కమిషనర్‌పై చర్యలు తీసుకోవాల్సిందే..

మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తాడిపత్రి మున్సిపల్ కమిషనర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేంత వరకూ నిరసనలు కొనసాగిస్తామని మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ వైఖరిని నిరసిస్తూ మున్సిపల్ కార్యాలయం వద్ద జెసితోపాటు కౌన్సిలర్లు చేపట్టిన నిరసన బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఈయన దీక్షకు పట్టణంలోని పలు ప్రజా సంఘాల నాయకులు, ఆర్ఎంపి సంఘం నాయకులు, నాయిబ్రాహ్మణ మహిళలు, స్వర్ణకారులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. తర్వాత ప్రభాకర్‌రెడ్డి సోదరుడు జెసి దివాకర్‌రెడ్డి కూడా దీక్షా శిబిరాన్ని సందర్శించి చర్చించారు. అనంతరం జెసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారులు తమ వద్దకు వచ్చి పాలకవర్గ 15 డిమాండ్లను పరిష్కరించేంత వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా స్థానిక కమిషనర్ మార్కెట్ వేలంపాటలు నిర్వహించకుండా పురపాలక సంఘానికి నష్టం తెచ్చారన్నారు. కౌన్సిల్ తీర్మానాన్ని ధిక్కరిస్తూ సీనియర్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై తీసుకురావడం, పట్టణంలో అండర్ గ్రౌండ్ వ్యవస్థకు సంబంధించి పనులు చేపట్టకపోవడం, కమిషనర్ మున్సిపల్ చట్టం రూల్ నెంబర్.3 అనుసరించకపోవడం, మున్సిపల్ చట్టంలో పొందుపరిచిన రూల్స్ విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న కమిషనర్‌పై జిల్లా అధికారులు చర్యలు చేపట్టకపోవడం, పురపాలక సంఘంలో డీజిల్ అన్యాక్రాంతం చేస్తున్న అధికారులపై కమిషనర్ చర్యలు చేపట్టకపోవడం వంటి సమస్యలు పరిష్కరించేంత వరకూ నిరసన కొనసాగుతుందని హెచ్చరించారు.

అనంతలో ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలో మునుపెన్నడూ లేనివిధంగా కనీవినీ ఎరుగని రీతిలో అబ్బురపరిచే అధునాతన హంగులతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఎఫ్‌కె ఎగ్జిబిషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ తెలిపారు. ఈమేరకు బుధవారం సాయంత్రం నగర శివారులోని రుద్రంపేట బైపాస్ సమీపంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను రుత్విక్ రెడ్డి, మహమ్మద్ ఫైజన్ ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ విదేశాల పెంపుడు జంతువులు, రంగురంగుల పక్షుల ప్రదర్శన, చిన్నపిల్లలు, మహిళలు, పెద్దలందరికీ ఆహ్లాదకరమైన వాతావరణం వినోదాన్ని కల్పించే విధంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా భారీ గొరిల్లా ముఖద్వారంతో, త్రీడీ సెల్ఫీ సెట్టింగులు, వాటర్ ఫౌంటేషన్లు నిర్మించామన్నారు. వీటితోపాటు జాయింట్ వీల్, కొలంబస్, సాలంబో, బ్రేక్ డ్యాన్స్, డ్రాగన్ ట్రైన్, వాటర్ బోటింగ్, డక్ ట్రైన్, బేబీ ట్రైన్, జోకర్ ట్రైన్, మోటర్ సైకిల్స్, కార్స్ రైడింగ్, దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ఆకర్షణీయమైన జ్యూవెలరీ ఐటమ్స్, కిచెన్ ఐటమ్స్, ప్లాస్టిక్ సామాన్లు, పింగాణీ వస్తువులు, చిన్న పిల్లల ఎలక్ట్రానిక్ ఆట వస్తువులు, కాటన్ రెడీమేడ్ దుస్తులు, చెప్పుల దుకాణాలు, మహిళల కోసం ప్రత్యేకమైన ఫ్యాన్సీ వస్తువులు, గహోపకరణాలు తదితర షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేశామన్నారు.

ఇంటర్ ఫలితాల్లో బ్లూమూన్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి, కదిరి టౌన్

ఇంటర్మీడియట్ ప్రథమ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కదిరిలోని బ్లూమూన్ విద్యార్థులు పై చేయి సాధించారు. గ్రేడుల్లో అయినా మార్కుల్లో అయినా బ్లూ మూన్ విద్యార్థులు టౌన్ ఫస్ట్ టాపర్లుగా నిలిచారు. పి సాయి రూప (బైపిసి) 975, ఆర్ తంజీల (ఎంపీసీ) 963, కే ఆలియా (ఎంపీసీ) 962, ఈ. కావ్య (ఎంపీసీ) 958, ఈ హర్షిత (బైపిసి) 957, ఎస్ సానియా (బైపిసి) 947, కే సృజనశ్రీ 947, డి ఆకాష్ (సిఇసి) 946 మార్కులు సాధించారు. ఈసందర్భంగా బ్లూ మూన్ విద్యాసంస్థల చైర్మన్ మంచి శివశంకర్ మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఇంతటి విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులకు, అందుకు కృషి చేసిన అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

బాగేపల్లి న్యూస్....

సిపిఎం ప్రజాసంఘాల్లో పలువురు చేరిక

ప్రజాశక్తి - చిలమత్తూరు (బాగేపల్లి నుంచి)

బాగేపల్లి తాలుక పాతపాళ్యం హొబ్లీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు సిపిఐ(ఎం) పార్టీ అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ ఆధ్వర్యంలో సిపిఐ(ఎం) ప్రజాసంఘాలలో బుధవారం చేరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సుబ్బారెడ్డి అభివృద్ధి చేస్తాడని ఆశించి రెండు సార్లు గెలిపించామన్నారు. అయితే ఆయన ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. పైగా ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి బాగా పెరిగిందన్నారు. సామాన్య ప్రజల పనులు ఒక్కటి కూడా జరగడం లేదని వాపోయారు. పాతపాళ్యం హెూబ్లీ అభివృద్ధి చెందాలంటే అది సిపిఐ(ఎం) అభ్యర్థి, విద్యావంతుడైన డాక్టర్ అనీల్ కుమార్ వల్లనే సాధ్యమవుతుందని భావించామన్నారు. దీంతో వంద మంది సిపిఐ(ఎం) అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్‌కు మద్దతు తెలుపుతూ ఆ పార్టీ ప్రజాసంఘాలలో చేరామని అన్నారు. పార్టీ లో చేరిన వారికి అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ కండువాలు వేసి స్వాగతం పలికారు. మద్దిలేటి, శంకర్, రమేష్, గుట్టమీదపల్లి వెంకటరెడ్డి, రెడ్డప్ప, రవి, శ్రీనివాస్, అక్బర్, ఇర్ఫాన్ తదితరులు సిపిఐ(ఎం) ప్రజాసంఘాల్లో చేరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బిల్లూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలతో సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్

పట్ట పగలే చోరీ

35 తులాల బంగారు, రూ. 1.60 లక్షల నగదు అపహరణ

కదిరి టౌన్ : కదిరి పట్టణంలో పట్టపగలే ఇంట్లో చొరబడి బంగారు నగదు దోచుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని బందారు నగర్ లో చిన్నారెడ్డి కుటుంబం నివసిస్తోంది. చిన్నారెడ్డి ల్యాబ్‌కు, అతని భార్య పని నిమిత్తం ధర్మవరం వెళ్లడంతో ఇంటికి తాళం వేశారు. ఇది గమనించిన దుండగులు ఇంటి తాళం పగులకొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. 35 తులాల బంగారు, రూ.1.60లక్షల నగదు దోచుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సిఐ మధు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గాండ్లపెంట : మండల పరిధిలోని రెక్కమాను వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం సీజ్ చేసినట్లు జమేదార్ రామయ్య తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి తహశీల్దార్ కార్యాలయంలో అప్పగించినట్లు తెలిపారు.

రెండిళ్లలో చోరీలు

పెనుకొండ : మండల పరిధిలోని వెంకటాపురం తండాలో మంగళవారం రాత్రి రెండిళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. బుధవారం ఎస్ఐ రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు వెంకటాపురం తండాకు చెందిన లక్ష్మీబాయి ఇంటిలో ఎవరూ లేని సమయంలో దొంగలు రూ.50,000 నగదు, ఒక నక్లెస్ ఎత్తుకెళ్లారని తెలిపారు. అలాగే గ్రామంలోని కమలాబాయి ఇంటిలో ఎవరూ లేని సమయం పసిగట్టిన దుండగులు లోపలికి ప్రవేశించి రూ.15,000 నగదు, ఒక జత వెండి కాళ్ల పట్టీలు దోచుకెళ్లారని తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే పుట్టపర్తి నుంచి క్లూస్ టీమ్‌ను పిలిపించి పరిశీలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చేనేత కార్మికుని ఇంట్లో..

సోమందేపల్లి: స్థానిక సాయినగర్‌లో నివాసం ఉంటున్న చేనేత కార్మికుడు లక్ష్మీనారాయణ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు బాధితులు వాపోయారు. వారు తెలిపిన వివరాల మేరకు... ఎండాకాలం కావడంతో రాత్రి కుటుంబ సభ్యులందరూ మిద్దెపై నిద్రించగా దొంగలు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి రూ.50వేల నగదు, 4 తులాల బంగారు కమ్మలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు.

జిల్లాలో పలువురు డీఎస్పీలు బదిలీ

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా పనిచేస్తున్న ఉమామహేశ్వర్ రెడ్డిని జమ్మలమడుగు ఎస్డిపిఓగా బదిలీ చేశారు. పుట్టపర్తి డీఎస్పీగా పనిచేస్తున్న యశ్వంత్‌ను చంద్రగిరి డీఎస్పీగా బదిలీ చేశారు. కడప దిశ డీఎస్పీగా పనిచేస్తున్న వాసుదేవన్‌ను పుట్టపర్తి డీఎస్పీగా నియమించారు. కదిరి డీఎస్పీ భవ్య కిషోర్‌ను రేణిగుంటకు బదిలీ చేయగా రాజమండ్రి సౌత్ నుండి ఎం శ్రీలతను కదిరి డీఎస్పీగా నియమించారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

కొత్తచెరువు : కొత్తచెరువుకు చెందిన వ్యక్తి వడదెబ్బతో బుధవారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన పేపర్ ఏజెంట్ ప్రవీణ్ (45) గతంలో పలు పేపర్లకు ఏజెంట్‌గా పనిచేసేవాడు. ఈ మధ్యకాలంలో ఫ్యాన్సీ స్టోర్ పెట్టుకొని జీవనం సాగించేవాడు. బుధవారం ఎండవేడిమితో ఇబ్బంది పడ్డాడు. దీంతో అస్వస్థతకు గురై బుధవారం సాయంత్రం మృతిచెందాడు. ప్రవీణ్ మృతితో అతని కుటుంబం పెద్దదిక్కు కోల్పోయింది. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రవీణ్ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

'మిషన్ వాత్సల్య'పై అవగాహన

ధర్మవరం టౌన్ : అనాథ, తల్లిలేదా తండ్రి లేని పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన మిషన్ వాత్సల్య పథకంపై నాయకులు పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈమేరకు మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆదేశాల మేరకు 23 వార్డులలో బుధవారం మిషన్ వాత్సల్య పథకం గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా పథకానికి సంబంధించిన దరఖాస్తులను అందజేశారు. ఈ పథకం వల్ల అనాథపిల్లలకు, తల్లి లేదా తండ్రిలేని, విడాకులు తీసుకున్న మహిళల పిల్లలకు 18 సంవత్సరాల వరకు నెలకు రూ.4వేలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇద్దరు పిల్లలుంటే రూ.8వేలు ఇవ్వడంజరుగుతుందన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రం వద్దకు వెళ్లి మిషన్ వాత్సల్య పథకానికి ఎంతమంది దరఖాస్తులు చేసుకున్నారో అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంధమనేని నారాయణస్వామి, తలారిగణేశ్, సయ్యద్, బాబాయ్య నబీరసూల్, బండ్లపల్లిరాజు, మల్లేనిపల్లిరాజు, కాశీంపాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై సానుకూల స్పందన

ప్రజాశకి - కదిరి టౌన్

ఎపిఎస్ ఆర్టీసీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చైర్మన్ ద్వారక తిరుమలరావు సానుకూలంగా స్పందించినట్లు. ఎన్ఎంయు నాయకులు హరి మోహన్ తెలిపారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ గా ఏర్పడిన తర్వా రాష్ట్ర అధ్యక్షులుగా పి.వి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వై.శ్రీనివాసరావు నిరంతరం ఉద్యోగుల సంక్షేమం కోసం శ్రమిస్తున్నారన్నారు. సంస్థ ప్రభుత్వంలోకి విలీనం అయిన తర్వాత ఎంప్లాయిస్ హెల్త్ కార్డులు, ఆటో మేటిక్ అడ్వాన్సు ఇంక్రిమెంట్స్, పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇప్పించారన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మేనేజింగ్ డైరెక్టరు ద్వారాకా తిరుమలరావుతో జరిపిన చర్చలలో మొదటగా అత్యధిక సంఖ్యాబలం ఉన్న అసోషియేషన్‌గా గుర్తించబడినందులకు అభినందనలు అందుకున్నామన్నారు. ఈసందర్భంగా ఎవరికి ఇబ్బంది కలగకుండా, ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్న వారు అక్కడనే పనిచేసే వెసులుబాటుకు హామీ పొందామన్నారు. సర్వీసులో చనిపోయిన, రిటైర్డు అయిన వారికి సెటిల్ మెంట్స్, కండక్టర్లకు, డ్రైవర్లకు డైలీ అలవెన్సులు, బెంగుళూరు పాయింట్ వారికి ఇంటి అద్దె భత్యం, హయ్యర్ ఆప్షన్‌లో ఏర్పడిన అవాంతరాలు తొలగించుట, కారుణ్య నియమకాలలో 2016 నుండి 2020 వరకు వున్న కేసులలో ఫ్యామీలీ మెంబర్లుకు వయస్సులో మినహాయింపులు ఇచ్చే విషయం పరిశీలన తదితర అంశాలలో హామీ తీసుకున్నామన్నారు. ట్రెజరీ ద్వారా ఆఫీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం కొరకు నూతన స్కానర్లు పంపిణీకి అనుమతి తీసుకున్నామన్నారు. ప్రతి విషయం లోను ఉద్యోగులకు అండగా నిలుస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ నాయకులకు కదిరిడిపో ఉపాధ్యక్షులు హరిమోహన్, ఎన్‌వి.రమణ, డిపో కార్యదర్శి బైరిశెట్టి తదితరులు అభినందనలు తెలిపారు.

ఎపిరైతుసంఘం ఆధ్వర్యంలో బ్యాంకు ఎదుట ధర్నా

ప్రజాశక్తి - తనకల్లు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైతుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో స్థానిక స్టేట్ బ్యాంక్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రైతుసంఘం నాయకులు వివి రమణ, మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రైతులకు సరైన సహకారం అందించడం లేదన్నారు. రైతులు తమ భూములను బ్యాంకులో తనఖా పెట్టి రుణాలు తీసుకుంటున్నారని అయితే బ్యాంకులు రైతులకు రుణాలు అందించడంలో నిర్లక్ష్య వహిస్తున్నాయన్నారు. ఎంతో విలువైన భూములకు తక్కువ మొత్తంలో రుణాలు అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న భూమి ధరలను అంచనా వేసి ప్రతి రైతుకు ఎకరానికి 50వేల రూపాయల నుండి లక్ష రూపాయల వరకు పంట రుణాలను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం తీసుకున్న పట్టాదారు పాస్ పుస్తకాలకు కొత్త రుణాలు ఇంతవరకు మంజూరు చేయలేదని, బ్యాంకు అధికారులను అడిగితే తమకు తెలియదని తప్పించుకుంటున్నారని విమర్శించారు. బ్యాంకు సేవలను వినియోగించుకోవడానికి బ్యాంకుకు వచ్చే వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని, ఎలాంటి షరతులు లేకుండా ఎస్‌బి అకౌంట్ నందు లావాదేవీలు నిర్వహించాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీరైతు సంఘం మండల నాయకులు ఎం. శివన్న, వెంకటరమణ, చలపతి ఓ.వేమన్న, సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఘనస్వాగతం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

స్థానిక ఎమ్మెల్యేలు, నాయకులతో మాట్లాడుతున్న సిఎం జగన్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సత్యసాయి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం అనంతపురం జిల్లా నార్పలలో జరిగే వసతి దీవెన కార్యక్రమంలో పాల్గొనడానికి గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 10 గంటలకు సత్యసాయి విమానాశ్రయానికి ముఖ్యమంత్రి చేరుకున్నారు. ముఖ్యమంత్రి వెంట బొత్స సత్యనారాయణ వచ్చారు. విమానాశ్రయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పి మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, మాలగుండ్ల శంకర్ నారాయణ, తిప్పే స్వామి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వెంకటరామిరెడ్డి, పివి సిద్ధారెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ తదితరులు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో మాజీ మంత్రి షబ్బీర్, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ఎంపీపీ ఎవి. రమణారెడ్డి, ఆర్‌డిఒ భాగ్యరేఖ, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, తదితరులు ఉన్నారు. అనంతరం హెలికాప్టర్ లో ముఖ్యమంత్రి జగన్ తో పాటు మంత్రులు బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నార్పలకు బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంతో పాటు పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బత్తలపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రయాణించే హెలికాప్టర్లో తలెత్తి సాంకేతిక లోపం వల్ల ఆయన రోడ్డు మార్గాన పుట్టపర్తికి బయలుదేరారు. బహిరంగసభ అయిపోగానే ఇళ్లకు చేరుకున్న పార్టీ శ్రేణులకు ఈ సమాచారం అందింది. దీంతో అప్పటికప్పుడు క్షణాల్లో బత్తలపల్లి కూడలిలో ప్రజలు పెద్ద ఎత్తున జగన్‌ను చూడటానికి గుమికూడారు. బత్తలపల్లి పోలీసులు, ఇతర ప్రాంతాలకు చెందిన పోలీసులు వాహనాలను ఎక్కడికక్కడ ఆపివేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కాన్వాయ్ బత్తలపల్లికి చేరుకోగానే శివాలయం నుంచి కూడలి వరకు ప్రజలు ముఖ్యమంత్రికి అభివాదం చెప్పుకుంటూ కేరింతలు కొట్టారు. కూడలిలో విక్రయానికి తీసుకువచ్చిన కనకాంబరాలు, బంతి పూలను జగన్ వాహనాన్ని ముంచెత్తారు. కాన్వాయ్ నుంచి సెక్యూరిటీ కిందకు దూకి ప్రజలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా జగన్ ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. మండలంలోని మాల్యవంతం, బత్తలపల్లి, పోట్లమర్రి గ్రామాల్లో ప్రజలు రోడ్డుపైకి చేరుకుని జగన్ మద్దతుగా అభివాదం చేశారు. సీఎం కూడా ప్రజలకు అభివాదం చేసుకుంటూ వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఏపీ కురుబ కార్పోరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న వసతిదీవెన సాయం రూ.33.68 కోట్లు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్, తదితరులు

సత్యసాయి జిల్లాలో జగనన్న వసతి దీవెన పథకం క్రింద 2022-23 సంవత్సరానికి సంబంధించి మొదటి విడత కింద రూ. 33.68 కోట్లు మంజూరు అయినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనంతపురం నార్పల లో బటన్ నొక్కి నిధులు విడుదల చేసిన నేపథ్యంలో కలెక్టరేట్ లో ఆ దృశ్యాన్ని వీడియో ద్వారా కలెక్టర్ తో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి, ఆర్డీవో భాగ్యరేఖ, పుడా చైర్పర్సన్ లక్ష్మీనరసమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ డిడి శివరంగ ప్రసాద్ తదితరులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో 35,080 వేల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలలో రూ. 33.68 కోట్లు నేరుగా జమ అయ్యాయని అన్నారు. ఇందులో ఎస్సీ సంక్షేమం క్రింద 4683 మంది విద్యార్థులకు రూ.4.47 కోట్లు, ఎస్టీ సంక్షేమం క్రింద 1951 మంది విద్యార్థులకు రూ. 1.84 కోట్లు, బీసీ సంక్షేమం క్రింద18,582 మంది విద్యార్థులకు రూ. 17.83 కోట్లు, కాపు సంక్షేమం క్రింద 2,775 మంది విద్యార్థులకు రూ. 2.65 కోట్లు, ఈ బిసి క్రింద 3,684 మంది విద్యార్థులకు రూ. 3.60 కోట్లు, ముస్లిం మైనార్టీ క్రింద 3,380 మంది విద్యార్థులకు రూ. 3.25 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీ క్రింద 25 మంది విద్యార్థులకు రూ. 2.30 లక్షలు లబ్ధి చేకూరుతోందన్నారు. ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులకు భోజన, వసతి ఖర్చులకు ఇబ్బంది పడకుండా ఏటా రెండు వాయిదాలలో ప్రభుత్వం తగిన చేయూతనిస్తోందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ అధికారులు మెగా చెక్కును విద్యార్థుల తల్లులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల దేవి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కదిరి ఎమ్మెల్యేకు చేదుఅనుభవం

ప్రజాశక్తి - కదిరి టౌన్

సిఎం పర్యటనలో కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బుధవారం అనంతపురం జిల్లా నార్పల మండలానికి వచ్చారు. దీంతో పుట్టపర్తి విమానాశ్రయం వద్ద సిఎంకు స్వాగతం పలకడానికి కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి వెళ్లిన సందర్భంలో ముఖ్యమంత్రి సిద్ధారెడ్డిని పక్కకు వెళ్లుఅన్నట్లు చెయ్యి ఊపడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ వీడియో చూసిన ప్రతి ఒక్కరు ముఖ్యమంత్రి ఎమ్మెల్యే సిద్ధారెడ్డిని పక్కన పట్టేసినట్లేనని చర్చించుకుంటున్నారు.

హంద్రీనీవా నీటి కేటాయింపుపై సిఎంకు ఎమ్మెల్యే వినతి

కదిరి అర్బన్ : సిఎం జిల్లాపర్యటన నేప్యంలో కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి తమ నియోజకవర్గంలోని సమస్యలపై సిఎంకు విన్నవించారు. గాండ్లపెంట మండలానికి హంద్రీనీవా నీటిని విడుదల చేసే విషయంపై వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలో అన్ని చెరువులకు నీటిని అందజేస్తున్నామని కేవలం ఒక గాండ్లపెంట మండలానికి హంద్రీనీవా నీటిని ఇవ్వలేకపోతున్నామని వివరించారు. నీటి కేటాయింపునకు సంబంధించిన పనులు త్వరగా చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయానికి సంబందించిన ఫైల్ ఫైనాన్షియల్ డిపార్ట్‌మెంట్‌లో ఉందని సిఎం దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు.

ఎల్ హెచ్‌పిఎస్ రవి నాయక్ గృహ నిర్బంధం

పుట్టపర్తి అర్బన్ : లంబాడి హక్కుల సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవినాయక్ ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. బుధవారం తెల్లవారుజామున 5 గంటలకే ప్రశాంతి గ్రామ్ లోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి గిరిజనుల సమస్యలపై విన్నవించాలని ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వం చేసిన జీవో 52ను రద్దు చేయాలని కోరుతామని గ్రహించి తనను ముందస్తు నిర్బంధం చేశారని రవినాయక్ తెలిపారు. తాను సత్యసాయి విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి గిరిజనుల సమస్యలపై విన్నవించుకోవాలని పర్మిషన్ ఇవ్వాలని ఉన్నతాధికారులను కోరానన్నారు. అయితే అనుమతి ఇవ్వకుండా ఇలా నిర్బంధించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి పుట్టపర్తి నుంచి వెళ్లే వరకు మఫ్టీ పోలీసులు తనను నిర్బంధించారన్నారు.

29 నుంచి సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు

కొత్తచెరువు : కొత్త చెరువులోనే బుక్కపట్నం రోడ్డు చెరువు కట్ట కింద ఉన్న సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు ఈనెల 29వ తేదీ నుండి మే 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు మనోహర్, నటరాజు, ఫణేంద్ర తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 29వ తేదీ గురువారం ధ్వజారోహణ తో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 30న హంస వాహనం, మే 1న బృంగి వాహనం , 2న శేష వాహనం, 3న నంది వాహనం, 4న కళ్యాణోత్సవం, 5న స్వామివారి రథోత్సవం, 6న పార్వేటోత్సవం ఉండగా 7న నిర్వహించే వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించండి

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘ అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ కోరారు. బుధవారం అనంతపురం జిల్లా నార్పలలో జరిగే బహిరంగ సభకు హాజరు కావడానికి వస్తున్న ముఖ్యమంత్రిని పుట్టపర్తి విమానాశ్రయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. హిందూపురం మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని వినతిపత్రాన్ని ఈసందర్భంగా సిఎంకు అందజేశారు.

29న సచివాలయ ఉద్యోగుల కలెక్టరేట్ల ముట్టడి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఈనెల 29న కలెక్టరేట్ల ముట్టడి ,ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా నాయకులు ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎపి జెఎసి అమరావతి మలి విడత ఉద్యమ కార్యచరణలో భాగంగా 29వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి వారి క్యాడర్లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లోని కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వివరించారు. తమ సమస్యలను శాంతియుతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇది ఒక వేదికని అందుకోసం ప్రతి గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులు ఈ ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ ఉద్యమ కార్యాచరణ ఉన్నత స్థానంలో ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ఇతర ఉన్నత అధికారులకు చట్టపరంగా తెలియజేసిన తరువాతనే నిర్ణయించామని ఈ వేదిక నుండి ఎలాంటి ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడడం గాని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడడం గాని జరగదని అన్నారు. కావున గ్రామ సచివాలయ ఉద్యోగులందరూ ఎలాంటి అభద్రతాభావానికి గురికాకుండా ధర్నాకు హాజరై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

నార్పలకు తరలివెళ్లిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

నార్పలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన బహిరంగసభకు బత్తలపల్లి మండల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివెళ్లారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు ఏపీ కురుబ కార్పోరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ జయరామిరెడ్డి ఆధ్వర్యంలో మండల నుంచి 16 బస్సుల్లో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

సిఎంకు నందివిగ్రహం అందజేస్తున్న కలెక్టర్

ముఖ్యమంత్రి జగన్‌కు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తిరుగు ప్రయాణంలో భాగంగా అధికారులు ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం నార్పల లో కార్యక్రమం ముగించుకుని సాయంత్రం 4:45 గంటలకు విమానాశ్రయానికి రోడ్డు మార్గం ద్వారా చేరుకున్నారు. విమానాశ్రయంలో ముఖ్యమంత్రి సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. అక్కడి నాయకులను పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం 5 గంటలకు విమానంలో గన్నవరానికి బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రికి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, ఉభయ జిల్లాల కలెక్టర్లు అరుణ్ బాబు, గౌతమి, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, తిప్పే స్వామి, పివి సిద్ధారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర విద్యా సలహాదారు ఆలూరి సాంబశివరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెసి టిఎస్ చేతన్, డిఐజి అమ్మిరెడ్డి, ఎస్ పి మాధవరెడ్డి, అనంతపురం ఎస్ పి శ్రీనివాసరావు, డిఆర్‌ఒలు ఘనంగా వీడ్కోలు పలికారు. సీఎం వెంట మంత్రులు బొత్స, నాగార్జున వెళ్లారు. ఈసందర్భంగా సత్యసాయి జిల్లా కలెక్టరు అరుణ్ బాబు నంది విగ్రహాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు.

కదిరి డీఎస్పీ బదిలీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

సాధారణ బదిలీల్లో భాగంగా కదిరి డీఎస్పీ భవ్య కిషోర్ తిరుపతి జిల్లా రేణిగుంటకు బదిలీ అయ్యారు. ఈమె స్థానంలో రాజమండ్రి సౌత్ డీఎస్పీగా పనిచేస్తున్న శ్రీలతను నియమిస్తూ ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు వెలువడ్డాయి.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - హిందూపురం

ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ 66వ జన్మదిన వేడుకల సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ అసుపత్రి వద్ద మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎపిపి ఇందాద్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు, ఇక్బాల్ అభిమానులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు, నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని పలు గ్రామాల్లో శ్రీ వాణి బ్లా సమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేసినట్లు సంస్థ అధ్యక్షురాలు శ్రీవాణి తెలిపారు. అమెరికాకు చెందిన కమల మేడం ఆధ్వర్యంలో పట్టణంలోని సత్యమ్మ గుడి వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో 180 మంది విద్యార్థులకు ఆమె చేతుల మీదుగా పెన్నులు, పుస్తకాలు అందజేశారు. వాటితో పాటు సత్యసాయి చిత్రపటాన్ని, జామెంట్రీ బాక్స్, సత్యసాయి విభూది, చాక్లెట్లు బిస్కెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీవాణి మాట్లాడుతూ సత్యసాయి సేవా స్ఫూర్తితో తమ వంతు సాయం గా విద్యార్థులకు ని ఈ చిన్న సహాయం సంస్థ తరఫున చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. గురువారం పట్టణంలోని గోకులం పాఠశాలలో విద్యార్థులకు వీటిని అందించనున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో లలిత జవహర్‌లాల్, శ్రీవాణి శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న విదేశీయురాలు

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడమేమనగా మా కక్షిదారుడయిన కె.రవినాయక్ అతని భార్య ఎస్.ప్రమీళబాయి, గంగినేపల్లి తాండ గ్రామ నివాసి, చెన్నెకొత్తపల్లి మండలం అనువారు ఈ క్రింది కనపరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిని కె.ఆర్. శ్రీకంఠయ్య, పెనుకొండ గ్రామ నివాసి దగ్గర నుండి విక్రయం పొంది వున్నారు. విక్రయపత్రం నెంబరు:2266/2008 తేది:30-06-2008 పై తేది నుండి సదరు కె.రవినాయక్ మరియు ఇతని భార్య ప్రమీళబాయి స్వాధీనంలో వున్నది. సదరు రవినాయక్ మరియు ప్రమీళబాయి ఈ క్రింద తెలిపిన షెడ్యూలు దాఖల ఆస్తిని స్టేట్‌బ్యాంకు ఆఫ్ పెనుకొండ వారికి ఆయకం వుంచి గృహ ఋణం పొందియున్నారు. కావున ఎవరికైన ఎటువంటి ఆక్షేపణలు కాని అభ్యంతరములు గానీ వున్న యెడల స్టేటు బ్యాంకు వారికి తెలుపగలరు అని తెలియజేయడం అయినది.

షెడ్యూలు:

హిందూపురం రిడి, పెనుకొండ సబ్.డి.కు చేరిన పెనుకొండ మండలం మరియు గ్రామ పొలము నందు సదరి పంచాయతీ ఏరియాలో గల **ఆస్తి వివరం:**

బాబు	సర్వేనెంబరు	విస్తీర్ణం
సర్కారు ఖుష్కి	445-1	ఎ.సి.7-70 సెంట్లు పైకి Plot No's: 45&42 పైకి

కొలతలు: తూర్పు-పడమర:47 అ॥లు, **ఉత్తరం-దక్షిణం:**55-6 అ॥లు

మొత్తం:291 చదరపు గజములు. **చెక్కుబంది: తూర్పు:** కె.ఆర్.పద్మనాభయ్య బయలు జాగ, **పడమర:** 13 అడుగుల వెడల్పు రోడ్డు, **ఉత్తరం:**నేను నిలుపుకొన్న బయలు జాగ, **దక్షిణం:** రేవతి బాయి బయలు జాగ.

స్టేటు బ్యాంకు వారి నెంబర్లు: 9866294299, 9701491217.

శ్రీమతి కె.జయకళ, న్యాయవాది
పెనుకొండ, శ్రీసత్యసాయి జిల్లా, సెల్: 9490859185.